RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 44 | జనవరి 21, 2026 | వెల : రూ.3-00


దినపత్రిక



మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

4లో..

# గులాబీ కోటలే టార్గెట్!




## మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పక్కా స్కెచ్! బీఆర్ఎస్‌కు పూర్తిగా చెక్ పెట్టేలా వ్యూహం

- ఖమ్మంలో చేసిన 'దిమ్మెలు కూలాలి' వ్యాఖ్యలు దేనికి సంకేతం?
- అన్ని పురపాలికలనూ టార్గెట్ చేసిన కాంగ్రెస్
- మంత్రులు చైర్మన్లుగా స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు
- ప్రత్యేకంగా సర్వే చేయిస్తున్న హస్తం పార్టీ పెద్దలు
- రెండు మూడ్రోజుల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం?
- వచ్చే నెల 3వ తేదీ నుంచి సీఎం జిల్లాల పర్యటన

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న వ్యూహాత్మక అడుగులు చూస్తుంటే, రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఆ పార్టీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో స్పష్టంగా తెలుస్తోంది. గ్రామాల నుంచి పట్టణాల వరకూ కాంగ్రెస్ జెండా ఎగరవేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఆచరణాత్మక రాజకీయానికి శ్రీకారం చుట్టారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లా మద్దులపల్లిలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీశాయి. గ్రామాల్లో బీఆర్ఎస్ దిమ్మెలు కూలాలంటూ ఆయన ఇచ్చిన పిలుపు, బీఆర్ఎస్‌పై ఎంత కసితో ఉన్నారన్నది బహిరంగంగానే వెల్లడి చేసినట్టయ్యింది. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎంతో దెబ్బతీయాలన్న సంకల్పంతోనే కాంగ్రెస్ ముందు కెళ్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని మున్సిపాలిటీల్లోనూ పునరావృతం చేస్తూ, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పట్టును పూర్తిగా విచ్ఛిన్నం చేయడమే సీఎం ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.

**– అన్ని మున్సిపాలిటీలే టార్గెట్లు**

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సుమారు 40 శాతం స్థానాలను బీఆర్ఎస్ మద్దతుదారులు దక్కించుకోవడం కాంగ్రెస్‌కు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. గ్రామీణ స్థాయిలో ప్రత్యర్థికి ఇంకా పట్టు ఉందని గ్రహించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఆ అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. అందుకే, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క మున్సిపాలిటీని కూడా విపక్షాలకు వదిలిపెట్ట కూడదనే పట్టుదలతో కేడర్‌ను సిద్ధం చేస్తున్నారు.

**– మంత్రులకు కీలక బాధ్యతలు**

ఎన్నికల నిర్వహణ కోసం కాంగ్రెస్ పార్టీ ఒక పక్కా యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల ఇన్ చార్జ్ మంత్రులకు పూర్తి బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికే పీసీసీ ఆదేశాల మేరకు ప్రతి వార్డు లేదా డివిజన్ నుంచి ఆరుగురు పేర్లతో కూడిన జాబితాను తెప్పించుకోనుంది. ఇందులో క్లీన్ ఇమేజ్ ఉండి, ప్రజల్లో పట్టున్న గెలుపు గుర్రాలను ఎంపిక చేసే ప్రక్రియ ప్రస్తు తం తుది దశకు చేరుకుంది. ఈ స్క్రీనిం గ్ కమిటీకి మంత్రులు చైర్మన్ గా, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు బాధ్య లుగా ఉంటారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ఈ స్క్రీనింగ్ ప్రక్రియను చాలా కఠినంగా చేపడుతున్నారని తెలుస్తోంది.

**– రెబెల్స్ భయం లేకుండా..**

టికెట్లు ఆశించే వారి సంఖ్య కాంగ్రెస్ పార్టీనుంచి ఎక్కువగా ఉండ టంతో, సీట్లు రాని వారు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం ఉం టుందని అధిష్టానం ముందే అంచనా వేస్తోంది. అటువంటి వారిని బుజ్జగిం చే బాధ్యతను పార్టీ పెద్దలకు అప్పగిం చారు. పార్టీ గెలిస్తే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామనే హామీతో అసంతృప్తిని చల్లార్చే ప్రయ త్నం చేస్తున్నారు. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాబట్టి, క్రమశిక్షణ ఉల్లంఘి స్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూనే, అందరినీ కలుపుకుపో యే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రెబెల్స్ బెడద లేకుండా చూసుకోవాలన్నది కాంగ్రెస్ ముఖ్య వ్యూహం.

**– రెండు, మూడ్రోజుల్లోనే షెడ్యూల్?**


సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిస్థితులపై రహస్యంగా సర్వే లు నిర్వహించినట్లు సమాచారం. అభ్యర్థుల బలాబలాలు, స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలపై డేటా సేకరిం చారు. ఇకపోతే, రెండు మూడు రోజుల్లోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి 14 లేదా 15వ తేదీ లోపు మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేలా సర్కార్ ప్లాన్ చేస్తోంది. కాగా, వచ్చే నెల 3వ తేదీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగనున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా బహిరంగ సభల్లో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపనున్నారు. ఈ ప్రచార కార్యక్రమం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.



వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ -2026 ను మంగళవారం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, రాష్ట్ర నాయకుడు మంద రాజు మాదిగ, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, సామాజిక కార్యకర్త జూపాక రాజు మాదిగ, బొడ్డు శ్యామ్ సుందర్ తదితరులు..

## ఎమ్మార్వోకు శుభాకాంక్షలు తెలిపిన జూపాక రాజు

**వేద న్యూస్, హనుమకొండ :**



తాజాగా కాజీపేట మండల తహసీల్దారుగా సిహెచ్ రాజు బాధ్య తలు చేపట్టారు.కాగా మంగళ వారం సామాజిక కార్యకర్త జూపాక రాజు కాజీపేట మండల తహసిల్దార్ కార్యా లయంలో తహసిల్దార్ సిహెచ్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంత రం శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

# డీసీపై వేటు!

## 'వేద న్యూస్' వరుస కథనాలకు స్పందన



వేద న్యూస్
తెలుగు దినపత్రిక
2025-12-23
https://epaper.vedhanews.in/

'డీసీ' రాజ్యమా?

- దేవాదాయ ధర్మదాయ శాఖలో దుమారం
- కారుణ్య నియామకాలలో అక్రమాలపై లేఖ కలకలం
- వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ పై తీవ్ర ఆరోపణలు

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డీసీ అంతా నా ఇష్టం.. నాదే రాజ్యం అనే తీరులో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. సదరు డిప్యూటీ కమిషనర్ పై మహిళా సిబ్బంది పేరుతో రాసిన లేఖ వాట్సాప్‌లో వైరల్ కావడంతో శాఖలో ఉద్రిక్తత నెలకొంది. డీసీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వరంగల్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగినులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లెటర్‌లో పేర్కొన్నారు. మాజీ డీసీపై ఆరోపణల నేపథ్యంలో ఆయనను బదిలీ చేయగా, ఆయన బ్యాచ్‌మేట్, సన్నిహితురాలిని నూతన డీసీగా నియమించారు.

– మహిళా సిబ్బందిపైనే కక్ష?

మాజీ డీసీ బదిలీకి మహిళా సిబ్బందే కారణమన్న అనుమానంతో, వారిపైనే కక్షగట్టి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఒకరు లేదా ఇద్దరిని తరచూ బదిలీ చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొందరిని పలుమార్లు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని లేఖలో వివరించారు.భర్త మృతి అనంతరం కుటుంబ పోషణ కోసం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన మహిళలను అవమానకరంగా మాట్లాడుతు న్నారని, 'ఏమి వస్తది.. ఏమి రాదు' అంటూ హేళన చేస్తున్నారని ఆరోపించారు. బొట్టు, గాజులు, పూలు, పూజలు వంటి వ్యక్తిగత అంశాలపైనా వ్యాఖ్యలు చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని లేఖలో వెల్లడించారు. తోటి మహిళా సిబ్బందిపై వివాహేతర సంబంధాలున్నాయంటూ దుష్ప్రచారం చేస్తూ, ఒకరి దగ్గర మరొకరి విషయాలు చెప్పి పరువు నష్టం కలిగిస్తున్నారని, ఒక మహిళగా ఉండి మహిళల మనోభావాలను కూడా పట్టించుకోవడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

– ఔట్సోర్సింగ్ సిబ్బంది తొలగింపు

డీసీ కార్యాలయంలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కక్షసాధింపుగా తొలగించారని, వారి స్థానంలో ముగ్గురిని కొత్తగా నియమించుకున్నారని ఆరోపించారు. అందులో ఒకరు మాజీ డీసీ వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేసిన ప్రైవేట్ వ్యక్తి కాగా, మరో వ్యక్తి అన్యమతస్తుడని లేఖలో పేర్కొన్నారు. ఈ నియామకాల కోసం రూ.3 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా సంచల నం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీసీ నుంచి తమను కాపాడి, మంచి వ్యక్తిత్వం గల అధికారిని నియమిం చాలని మహిళా సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ లేఖలు అసల్యంగా వెలుగులోకి వచ్చాయి.

- ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ బాధ్యతల నుంచి సంధ్యారాణి రిలీవ్
- ఆర్.సునీతకు వరంగల్ డీసీగా పూర్తి అదనపు బాధ్యతలు
- దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ
- 'వేద న్యూస్' తెలుగు దినపత్రికకు బాధితుల కృతజ్ఞతలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డీసీ తీరుపై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలకు స్పందన వచ్చింది. సదరు ఆఫీసర్‌పై వేటు పడింది!. డిప్యూటీ కమిషనర్ బాధ్యతల నుంచి ఆమెను రిలీవ్ చేస్తూ..సదరు పోస్టులో ఎఫ్ఏసీగా(ఫుల్ అడిషనల్ చార్జ్) పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్.సునీతను నియమిస్తూ..దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**బాధితుల పక్షాన 'వేద న్యూస్' అక్షర పోరాటం**

వరంగల్ దేవాదాయ ధర్మదాయ శాఖలో డీసీ.. 'అంతా నా ఇష్టం.. నాదే రాజ్యం' అనే తీరులో వ్యవహరిస్తున్నట్లు బాధితులు ఆరోపించారు. సదరు ఆఫీసర్ వల్ల తాము తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొందరిని పలుమార్లు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ నేపథ్యంలోనే 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో తన ప్రధాన సంచికలో 'డీసీ రాజ్యమా?', 'డీసీపై ఎంక్వయిరీ?', 'డీసీపై చర్యలు ఉండేనా?', 'డీసీకి ఏం కాదు!' శీర్షికలతో వరుస కథనాలను ప్రముఖంగా ప్రచురించింది. ఈ క్రమంలోనే సదరు శాఖ ఉన్నతాధికారులు స్పందించి..విచారణ చేసినట్టు సమాచారం. మహిళా సిబ్బంది వాంగ్మూలాలు తీసుకుని ఆఫీసర్ల నివేదిక అనంతరం ఉన్నతాది కారులు చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది.

**వివాదాల నడుమ కీలక ఉత్తర్వులు**

వరంగల్ దేవాదాయ శాఖలో మహిళా సిబ్బంది వేధింపుల ఆరోపణలు, విచారణ ఆలస్యమనే విమర్శల నడుమ దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ పరిపాలనా ఉత్తర్వులు వెలువడటం గమనార్హం. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం.. వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునీతకు డిప్యూటీ కమిషనర్ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆమె ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. అదే సమయంలో ఎండోమెంట్స్ ట్రిబ్యునల్, అసిస్టెంట్ కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వరంగల్ డీసీ అదనపు బాధ్యతల నుంచి కె.ఎన్. సంధ్యారాణిని రిలీవ్ చేశారు.

# ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేత

**– ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

**వేద న్యూస్, జమ్మికుంట:**

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ప్రాణాధారంగా మారుతూ, మానవత్వాన్ని ఆలయ ఫౌండేషన్ నిలబెడుతోంది. కరీంనగర్ జిల్లావీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు దొమ్మటి అంకూస్ గౌడ్ అనారోగ్య కారణంగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ, అత్యవసరంగా ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అవసరమైన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉండగా, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ ను సంప్రదించారు. వెంటనే స్పందించిన గుణసాగర్, ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు, సమాజ సేవకు ప్రతిరూపమైన పరికిపండ్ల నరహరి ఐఏఎస్ సహకారంతో అంకూస్ గౌడ్‌కు అవసరమైన ఆక్సిజన్ కాన్సెంట్రేటర్‌ను మంగళవారం అందించారు. ఈ సాయం వల్ల బాధితుడు సమయానికి చికిత్స పొందగలిగి, కుటుంబంలో ఆశా దీపం వెలిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, నేత దొమ్మటి రాజమల్లు గౌడ్ పాల్గొని, మానవత్వాన్ని చాటేలా సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వ హోదాలో ఉన్నా, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ఎల్లప్పుడూ పేదలు, బలహీన వర్గాల కోసం ఆలోచిస్తూ, సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆలయ ఫౌండేషన్ చేపడుతున్న సేవలు అనేక కుటుంబాలకు జీవనాధారంగా మారుతున్నాయి.



# ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా 'వేద న్యూస్'

**– రాజన్న సిరిసిల్ల జిల్లా జాయింట్ కలెక్టర్ నగేష్**
**– వేద న్యూస్ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరణ**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వేద న్యూస్ దినపత్రిక-2026 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ నగేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. వేద న్యూస్ దినపత్రిక నేటి సమాజంలో జరుగుతున్న అనేక సమస్యలను వెలికితీస్తూ, నిజాలను నిర్భయంగా ప్రజలకు చేరవేస్తోందని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ వేద న్యూస్ విజయవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై పోరాడుతూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ముందు వరుసలో నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో



జిల్లా స్టాఫర్ పైడి రాజు, సిరిసిల్ల టౌన్ రిపోర్టర్ గూడ రమేష్ రెడ్డి, బోయినపల్లి రిపోర్టర్ మైలారం మహేష్, వీర్నపల్లి రిపోర్టర్ తిప్పర్తి కళ్యాణ్, శంకరపట్నం మండల రిపోర్టర్ దేవునూరి అంకుస్, నిజాం రిపోర్టర్ కాశి పాక కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైల్వే పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్యువల్ డే




**– హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**– పాకెట్ డైరీ ఆవిష్కరణ**

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట పట్టణ రైల్వే పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్యువల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రైల్వే సంఘ కార్యాలయంలో సభ్యులతో కలిసి పాకెట్ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే పెన్షనర్ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ కె. నారాయణ, జోనల్ సెక్రటరీ కె. విద్యాసాగర్, డివిజనల్ ప్రెసిడెంట్ బి. ఆంజనేయులు, డివిజనల్ సెక్రటరీ సాయికుమార్, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రాజాలి, రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్రు నర్సింగ్ రావు పాల్గొన్నారు. అలాగే పీడబ్ల్యూఏఆర్ కాజీపేట బ్రాంచ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి గుర్రపు సుధాకర్ రావు, చంద్రమోహన్, వడ్నాల నాగేష్, సత్యనారాయణ, కుమారస్వామీ దేవదాస్, ఆర్.ఎల్. ప్రసాద్, బాబు రాజ్, భాస్కర్ శ్రీనివాసరావుతో పాటు సుమారు 400 మంది పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

**– బాధితులకు న్యాయం అందించాలి**
**– అత్యాచార, పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలి**
**– ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి**
**– మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు**

**వేద న్యూస్, మెదక్:**

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత సంఖ్యలో ఉండేలా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అధికారులకు సూచించారు. నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యాచార, పోక్సో కేసుల్లో దర్యాప్తును మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో దోషులను న్యాయస్థానం ముందు హాజరు పరచాలని తెలిపారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి, ఎఫ్ఎస్ఎల్ పెండింగ్ రిపోర్టులను త్వరగా పొంది కేసులను ఫైనల్ చేయాలని సూచించారు. నెంబర్ పెండింగ్ కేసుల్లో సంబంధిత మెజిస్ట్రేట్‌లతో చర్చించి సీసీ నంబర్లు పొందాలని ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్




మోసాలపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని, ప్రజల్లో భద్రతా భావం కలిగేలా ప్రతి పోలీస్ అధికారి క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, సీఐలు జానా రెడ్డి, రేణుక రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 19 మంది పట్టుబడగా, అందులో ముగ్గురు వ్యక్తులు నిర్ణీత పరిమితికి మించి మద్యం సేవించినట్లు గుర్తించారు. వారిని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప ఎదుట హాజరు పరిచారు. వీరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. జైలు శిక్ష పడిన అరుకల రాంమోహన్ రావు, పింటూ సింగ్, కత నిరంజన్లను హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.



# రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



మండల పరిధిలోని వంతడుపుల రోడ్ బ్రిడ్జి నుంచి కాలువ గట్టు దారి వరకు ఇరు వైపుల ఏర్పడిన గుంతలను పూడ్చి, రైతులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని బూజునూరు గ్రామ సర్పంచ్ చర్లపల్లి శ్రీనివాస్‌ను రైతులు కోరారు. ఈ మేరకు రైతుల తరపున మంగళవారం సరిగొమ్ముల మనోహర్, జ్యోతి మనోహర్, సోమిడి చేరాలు, సరిగొమ్ముల హరి ప్రసాద్, సరిగొమ్ముల శ్రీనివాస్, సరిగొమ్ముల కిషన్, లక్ష్మణ్, కల్లెపల్లి నవీన్, ఇల్లందుల సదానందం, అంజి, దామోదర్, సరిగొమ్ముల లత, రజిత, రాములు కలిసి సర్పంచ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మార్గంలో గుంతల కారణంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. వెంటనే మరమ్మ తు లు చేపట్టి రాకపోకలు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామనిసర్పంచ్ చర్లపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

# వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ






**వేద న్యూస్, రుద్రూర్:**

వేద న్యూస్ నూతన సంవత్సర క్యాలెండర్ ను రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాలను నిర్భయంగా రాస్తూ అనతికాలంలోనే అనేకమంది పాఠకులను వేద న్యూస్ సొంతం చేసుకుందన్నారు. పాఠకుల నుంచి విశిష్ట ఆదరణ పొందుతున్న వేద న్యూస్ పత్రికకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వేద న్యూస్ ప్రతినిధి గుండూరు శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాలను నిర్భయంగా రాస్తున్న 'వేద న్యూస్'

**– నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన సర్పంచ్**

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యుల చేతుల మీదుగా వేద న్యూస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయాలకు కొమ్ము కాయకుండా నిజాలను నిర్భయంగా రాస్తూ వేద న్యూస్ తక్కువ కాలంలోనే అనేక మంది పాఠకులను సొంతం చేసుకుందని కొనియాడారు. పాఠకుల నుంచి విశేష ఆదరణ పొందుతున్న వేద న్యూస్ పత్రికకు ఆమె శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రేమ్ దాస్, వడ్ల నరేష్, అనిల్, అక్కపల్లి శ్రీను, ఇమ్రాన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం

**– మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**
**– రైతులకు సబ్సిడీ యంత్రాలు అందజేత**




**వేదాన్యూస్, దామరచర్ల:**

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులను ప్రోత్సహించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్రాలు అందజేస్తుందన్నారు. అలాగే ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ, రూ.500 బోనస్ లాంటి పథకాల ద్వారా రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలి

**– హనుమకొండ ఎస్ఈ మధుసూదన్ రావు**
**– విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజాబాట**



**వేద న్యూస్, శాయంపేట :**

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను వెంటనే సరిచేసి, బావుల వద్ద గానీ ఇళ్లలో గానీ నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని హనుమకొండ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్ రావు అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలం తాహరాపూర్ గ్రామంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మధుసూదన్ రావు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించేందుకు ప్రజా బాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, లోపాలను వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ జె. దేవేందర్ నాయక్ (పరకాల), సబ్ ఇంజనీర్ యం. చొక్కారావు (శాయంపేట), లైన్ ఇన్స్పెక్టర్ ఏ. రాజేందర్, లైన్మెన్ బి. సోముల, ఏఎల్ఎం యు. సాగర్, విష్ణు, రాజు (ఆన్‌మాన్), తాహరాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుసంగిలో ఉచిత మెగా వైద్య శిబిరం



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఎంఎన్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కంటి ఆపరేషన్లు, గడ్డలు, కణుతులు, అర్షమొలలు వంటి పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకోగా, కొందరిని డాక్టర్లు మెరుగైన వైద్య చికిత్స కోసం ఎంఎన్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య సేవలు అందించిన ఎంఎన్ఆర్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి గ్రామ యువకులు గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు నారాయణ గౌడ్, వెంకట్, శ్రీనివాస్, లక్ష్మయ్య, రాంరెడ్డి, అడివయ్య, రమేష్, ఆంజనేయులు, యాద గౌడ్, అనిల్ గౌడ్, యాదయ్యతో పాటు ఎంఎన్ఆర్ వైద్య బృందం మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**- జిల్లా అధ్యక్షురాలు పి. వరలక్ష్మి**




**వేద న్యూస్, దామరచర్ల:**

హైదరాబాద్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ 14వ మహాసభలకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. వరలక్ష్మి పిలుపునిచ్చారు. దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. 25వ తేదీన హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు మహిళలు వేలాదిగా తరలిరావాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి ఊరుకో బండి, ఇంటికో మహిళ తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఐద్వా జాతీయ మహాసభలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ, దేశవ్యాప్తంగా నుంచి వేలాది మంది ప్రతినిధులు హాజరై మహిళల సమస్యలపై సమగ్ర చర్చలు జరిపి, భవిష్యత్తులో మహిళల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కోసం తీర్మానాలు, పోరాటాల కార్యక్రమాలు నిర్ణయిస్తారని తెలిపారు. ఇందుకు హైదరాబాద్ వేదిక కానుందని చెప్పారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిత్యం జరుగుతున్న ఈ అన్యాయాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులకు త్వరితగతిన శిక్షలు విధించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మహిళల అభ్యున్నతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు శివనేని శాంతమ్మ, సభ్యులు మంగమ్మ, రమణ, సైదమ్మ, లలిత, లక్ష్మి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్, ఎంపీడీవో





**వేద న్యూస్, కమలాపూర్:**

వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ 2026 ను కమలాపూర్ తహసీల్దార్ సురేష్, కమలాపూర్ మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, కమలాపూర్ గ్రామ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం కమలాపూర్ మండల అధ్యక్షుడు పుల్ల కొమురయ్య, ప్రెస్ యూనియన్ అధ్యక్షుడు డా. మౌటం కుమారస్వామి, కమలాపూర్ గ్రామ వార్డ్ మెంబర్ పుల్ల అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు పుల్ల శోభన్ బాబు తదితరులు.

ఆవిష్కరించిన ఎంపీడీవో..

వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్-2026 ను ఆవిష్కరిస్తున్న కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు, బీజేపీ మండల నాయకులు తూర్పాటి భాస్కర్, కమలాపూర్ గ్రామ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం కమలాపూర్ మండల అధ్యక్షులు పుల్ల కొమురయ్య తదితరులు.

# 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తంగేళ్ల స్వప్న కృష్ణమోహన్



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తంగేళ్ల స్వప్న కృష్ణమోహన్ బరిలో ఉన్నారు. విద్యావంతురాలైన స్వప్న రాజకీయాల్లోకి రావాలని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే సంకల్పంతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వార్డు ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజకీయ నేపథ్యం కలిగిన తన కుటుంబం నుండి ఈసారి అవకాశం వచ్చిందని 12వ అవార్డు ప్రజలు తమ ఆడబిడ్డగా భావించి ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా సేవ చేస్తూ వారికి 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉండటం జరుగుతుందని ఆమె తెలిపారు. మెరుగైన సమాజం ఏర్పాడాలంటే సమస్యలపై అవగాహనతో పాటు ప్రజల మన్ననలు పొందాలని కుటిల రాజకీయాలకు దూరంగా ఉంటూ సేవే లక్ష్యంగా పనిచేయాలని మీ ముందుకు వస్తున్నాన ని మీ బిడ్డకు మీ ఆశీర్వాదం అందించి ఆదరిస్తే గెలిచి మీకు అండగా ఉంటాన ని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. 12వ వార్డులో పుట్టి పెరిగిన కుటుంబం లో ఉన్నానని ఇక్కడి స్థితిగతులపై పూర్తి అవగాహన ఉందని పార్టీలకు అతీతం గా నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే సేవకురాలిగా పని చేస్తానని ఆమె తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆమె చేతులెత్తి ప్రార్థించారు.

# మల్లారెడ్డి భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతల నివాళి



**వేద న్యూస్, ఇల్లంద కుంట:**

ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బోగంపాడు గ్రామ మాజీ ఎంపీటీసీ ఎక్కటి సంజీవ్ రెడ్డి తండ్రి ఎక్కటి మల్లారెడ్డి అకాల మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మంగళవారం బోగంపాడు గ్రామంలోని మల్లారెడ్డి నివాసానికి చేరుకుని, ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. మల్లారెడ్డి మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రణవ్ తో పాటు ఇల్లంతకుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ది కుమార్, డాక్టర్ సురంజన్, వాసాల రామస్వామి, శ్రీకాంత్ రెడ్డి, అజయ్ తదితర కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి భౌతికాయానికి నివాళులు అర్పించారు.

# సర్పంచులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి
- పన్నుల వసూలు సకాలంలో చేపట్టాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**వేద న్యూస్, కారేపల్లి:**

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకుని ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పాలనలో పంచాయతీ సెక్రటరీతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన పరిపాలన అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మిషన్ భగీరథ ట్యాంకుల ను కాలానుగుణంగా శుభ్రపరచాలని తెలిపారు. పన్నుల వసూలు సకాలం లో చేపట్టి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీలు అభివృద్ధి చేయాలని, కొత్త మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, జెడ్పీ సీఈవో దీక్షా రైనా, శిక్షణ పర్యవేక్షకురాలు విద్యాలత, సంబంధిత శాఖల అధికారులు, నూతన సర్పంచులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ వంశీధర్
- రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఎంవీఐ వంశీధర్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు చెల్లించి ఉండాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను, కాలం చెల్లిన వాహనాలను రోడ్లపై నడపరాదని హెచ్చరించారు. వ్యవసాయం కోసం అనుమతి పొందిన ట్రాక్టర్లను రవాణా కోసం వినియోగించవద్దని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆరు వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రశాంత్‌తో పాటు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ విభిన్న సంస్కృతుల నిలయం



**వేద న్యూస్, హనుమకొండ :**

మై భారత్ వరంగల్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతరాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 మంది యువతీ యువకులు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు, తమ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను స్థానిక యువతకు పరిచయం చేయనున్నారు. యువత మధ్య పరస్పర అవగాహన పెంపొందించడం, జాతీయ సమైక్యతను బలపరచడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం జనవరి 20 నుండి 24 వరకు కొనసాగనుంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి మై భారత్ వరంగల్ ఉప సంచాలకులు చింతల అన్వేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ .రవి, అదనపు కలెక్టర్, హనుమకొండ జిల్లా, యువతను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ యువత జాతీయ నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, స్వామి వివేకానందుల ఆదర్శాలను అనుసరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి భారత యువకుడు ఇతర మతాలు, సంస్కృతులను గౌరవిస్తూ, ఎలాంటి ద్వేష భావాలు లేకుండా ఐక్యతతో జీవించాలని సూచించారు. ఇటువంటి అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమాలు యువతలో సోదరభావాన్ని పెంపొందించి, జీవితాంతం సానుకూల దృక్పథంతో జీవించే శక్తిని అందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆహ్వానితుడిగా హాజరైన ఇ.వి. శ్రీనివాస్ రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రతి యువకుడు సమాజ సేవలో చురుకుగా పాల్గొని మానవతా విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమానికి ప్రత్యేక ఆహ్వా నితుడిగా హాజరైన మండల పరశురాములు, జాతీయ యువజన అవార్డు గ్రహీత (భారత ప్రభుత్వం) మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, ఎలాంటి ఆశలు లేకుండా సమాజ సేవ చేయాలనే గుణం యువతలో పెరగాలని అన్నారు. విద్యాభ్యాస దశలోనే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో యువతను ప్రభుత్వం విస్తృతంగా భాగస్వాము ల ను చేయాలని సూచి ంచారు. గ్రామాల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారాలపై అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. శ్రీనివాస్ కుమార్, జిల్లా ఖజానా అధికారి, రవీందర్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్, రంజిత్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు అకులపల్లి మధు, సూపరింటెండెంట్ దేవి లాల్, వాలంటీర్లు సురేష్, నవీన్, కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు, స్థానిక యువజన సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ జాతీయ సమైక్యతను పెంపొందించే విధంగా యువతకు మానసిక వికాస శిక్షణ అందించారు. ఈ అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం యువతలో జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# వైభవంగా వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం




**వేద న్యూస్, మందమర్రి:**

ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని మందమర్రి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో వాసవి మాత అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలను వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తమ్మిశెట్టి మంజుల, కార్యదర్శి గడ్డం మాలతి, కోశాధికారి గంప శ్రీదేవి, వాసవి వనిత క్లబ్ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముసుగు దొంగలు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

**- ప్రజలను అలర్ట్ చేసిన మెట్‌పల్లి పోలీసులు**

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ దుండగులు మెరూన్ రంగు షర్ట్, తెలుపు రంగు షర్ట్ ధరించి, ముఖాలకు మాస్కులు పెట్టుకొని ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. పట్టణంలో ఎక్కడైనా ఈ తరహా లక్షణాలు కలిగిన వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఇలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 87126 56794 నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కిరణ్ కుమార్ ప్రజలను కోరారు.

# సర్పంచ్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం

**- గ్రామ అభివృద్ధిపై చర్చ**

**వేద న్యూస్, కారేపల్లి:**

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ హీరాలల్ అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి గ్రామంలోని మొత్తం 12 మంది వార్డు సభ్యులు హాజరుకావడం విశేషం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభ్యులందరూ కలిసికట్టుగా ముందుకు రావడంపై సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గ్రామ పరిపాలనలో ఒక మంచి ముందడుగని, ఐక్యమత్యంతోనే గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీటి సరఫరా, 'పరిశుభ్రమైన గ్రామం' లక్ష్యంగా చెత్త సేకరణ, బ్లీచింగ్ పనుల వేగవంతం, ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా




చూడటం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వార్డు సభ్యులందరూ పూర్తిస్థాయిలో హాజరై తమ అమూల్యమైన సలహాలు అందించడం శుభపరిణామం. అందరి సహకారంతో మన గ్రామాన్ని మండలంలోనే నంబర్ వన్ గ్రామంగా తీర్చిదిద్దుతాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- **బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి ఏర్పాట్లు పూర్తి చేయాలి**
- **సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి**
- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**
- **వీసీలో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్, అధికారులు**

**వేద న్యూస్, మంచిర్యాల :**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాలు, పీఓలు, ఓపీఓలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు,



స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు, చెన్నూర్‌లో 18 వార్డులు, క్యాతనపల్లిలో 22 వార్డులు, లక్సెట్టిపేటలో 15 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వెబ్‌కాస్టింగ్, అధికారుల నియామకం, శిక్షణ, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతోనే అన్నీ సాధ్యం




- **సరైన జీవనశైలిని అనుసరించాలి**
- **ప్రతిమ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ టి. సుమిత్ర**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్ :**

క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, మంచి ఆహార అలవాట్లతో క్యాన్సర్ వంటి మహమ్మారి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రతిమ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ టి. సుమిత్ర తెలిపారు. ఊరుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కౌమార, మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలిని సరైన మార్గంలో ఉంచుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ వ్యాధులన్నీ ప్రమాదకరమైనవే కాకపోవచ్చని, సరైన సమయంలో గుర్తిస్తే చికిత్స సులువవుతుందని తెలిపారు. 9 నుంచి 14 ఏళ్ల బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. ఆగస్టు 15వ తేదీ వరకు దామెర క్రాస్ రోడ్‌లోని ప్రతిమ ఆసుపత్రిలో డిజిటల్ మెమోగ్రఫీ, హై రిజల్యూషన్ బ్రెస్ట్ స్కాన్, సీరమ్ క్రియాటినిన్, పాప్ స్మియర్, సీబీపీ, ఆర్బీఎస్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, ఉపాధ్యాయులు డాక్టర్ గణపతి, రాజేంద్రప్రసాద్, విజయ ప్రభ, అనిత కుమారి, డాక్టర్ వి. జగన్, వసుందర దేవి, స్వరూప రాణి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, జయ, సమత, సురేందర్, పాఠశాల విద్యార్థినులు, విద్యార్థులు, ఇతర ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

# దేవాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

**- ఓరియంట్ సిమెంట్-అదాని ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం**



**వేద న్యూస్, కాసిపేట:**

ఓరియంట్ సిమెంట్ దేవాపూర్, అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన దేవాపూర్ గ్రామ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామ పంచాయతీ, గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఓరియంట్ సిమెంట్-అదాని ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ఈ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ సర్పంచ్ సిడం రాందాస్, పంచాయతీ సెక్రటరీ కవిత, ఓరియంట్ సిమెంట్ హెచ్ఆర్ హెడ్ నరేంద్ర జాన్వే, లైజనింగ్ ఆఫీసర్ కారుకూరి తిరుపతి, ఓరియంట్ సిమెంట్ అధికారులు పాల్గొన్నారు. అలాగే గ్రామ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దేవాపూర్ గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఓరియంట్ సిమెంట్-అదాని ఫౌండేషన్ చేపడుతున్న సేవలను గ్రామస్తులు అభినందించారు.

# పదవ తరగతి విద్యార్థులకు గైడ్ల పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్:**

రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఎంఐఎం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని కామారెడ్డి జిల్లా ఎంఐఎం పార్టీ ఇంచార్జ్ మహమ్మద్ షకీల్ అన్నారు. మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని రుద్రూర్, సులేమాన్ నగర్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాలర్ ఏ మిల్లాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి గైడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ షకీల్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీ సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్తు తరాలకు ఉన్నత విద్య అందించాలనే సంకల్పంతో గత 25 ఏళ్లుగా పుస్తకాలు, స్టడీ మెటీరియల్, గైడ్లను ట్రస్ట్ తరఫున విద్యార్థులకు అందజేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం స్టడీ మెటీరియల్, గైడ్లను సమకూర్చిన ఎంఐఎం పార్టీ అధ్యక్షులు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కామారెడ్డి జిల్లా ఇంచార్జ్ మహమ్మద్ షకీల్, జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ లాయఖ్, బాన్సువాడ అధ్యక్షులు సయ్యద్ ఖాన్లకు విద్యార్థుల తరఫున, వారి కుటుంబాల తరఫున షేక్ గౌస్ కృతజ్ఞతలు తెలిపారు.



# చిన్నారికి గిరిజన నాయకుడి ఆశీర్వాదం

**వేద న్యూస్, కారేపల్లి :**



భీక్యాతండాకు చెందిన వాంకుడోత్ వంశీ - సాయి ప్రియ దంపతుల చిన్నారి అన్నప్రాసన వేడుకను మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ సన్నిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల మాజీ ప్రధాన కార్యదర్శి, గిరిజన నాయకుడు అజ్మీర వీరన్న హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో వాంకుడోత్ విజయ్, వార్డు సభ్యులు అజ్మీర మమత, వాంకుడోత్ రమేష్, వాంకుడోత్ విజయ, వాంకుడోత్ సూర, సాయిరాం, రాంకీ, రామకృష్ణ, కిరణ్, లచ్చు, రమేష్, దేవిలాల్, నరేష్, చందర్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# లచ్చిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన జూనియర్ అసిస్టెంట్స్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లాలో జూనియర్ అసిస్టెంట్స్ ప్రొబేషన్ డిక్లేర్ చేపించినందుకు మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయంలో ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీజీఆర్ఎస్ఏ గౌరవ అధ్యక్షులు లచ్చిరెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా తరపున కలిసి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం తెలంగాణ ఇంక్రిమెంట్ ను కూడా ఇప్పించగలరని కోరగా సానుకూలంగా స్పందించి త్వరలోనే జీవో ఇప్పించేటట్టు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోమాండ్ల రాజు, ఎడ్ల రవి (వైస్ ప్రెసిడెంట్, టీజీఆర్ఎస్ఏ జనగామ), గణేష్, రాజశేఖర్, సహారా పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- **విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**వేద న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో మైనారిటీ గురుకుల విద్యాసంస్థల ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రాలను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో tgmreistelangana. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని



చెప్పారు. వివరాల కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 7331170790 ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఎం.డి. తాహేరుద్దీన్, అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ మందపెల్లి సంధ్య, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపల్ గోపి, కళాశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ నీలు తదితరులు పాల్గొన్నారు.

# లింగుస్వామి జాతరలో మజ్జిగ పంపిణీ

**వేద న్యూస్, కాసిపేట:**




కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కుర్రెఘడ్ గ్రామంలో గోండీ ధర్మగురు శ్రీ పాహుండి కుపార్ లింగు స్వామి జాతర దర్బార్ మంగళవారం ఘనంగా ముగిసింది. జాతర మూడవ, చివరి రోజు సందర్భంగా భక్తులకు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని భక్తులకు చల్లటి మజ్జిగ అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వూటూరి సాయికుమార్తో పాటు సభ్యులు వంగల శ్రీనివాస్, రావికంటి అరుణ్, శేఖర్, వొజ్జల రాజు, జైన్ సాయి, పడమటింటి రాకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు యువజన సంఘం సభ్యులను అభినందించారు.

# ఘనంగా ముగిసిన లింగు స్వామి జాతర

**- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్రెఘడ్ గ్రామంలో ఆదివాసీలు తమ సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే గోండీ ధర్మ గురు శ్రీ శ్రీ శ్రీ పాహుండి కుపార్ లింగు స్వామి జాతర దర్బార్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా లింగు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవునికి స్నానం చేయించి అనంతరం సన్నిధిలో ప్రతిష్ఠించారు. ఆ తరువాత ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రసాదాలను గ్రామంలో పంచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జాతర దర్బార్ సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకొని కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. సంప్రదాయ వాయిద్యాలు, పూజా విధానాలతో జాతర మరింత శోభాయమానంగా సాగింది. గ్రామ పెద్దలు, ఆదివాసీ నాయకులు జాతర ప్రాముఖ్యతను వివరించారు. ఈ జాతరను విజయవంతంగా నిర్వహించడంలో గ్రామ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు సమిష్టిగా కృషి చేశారు. భక్తులు శాంతి భద్రతలు కాపాడిన నిర్వాహకులను అభినందించారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 21, 2026

# బస్సు కోసం ప్రయాణికుల తిప్పలు

- కోదురుపాకలో ప్రజా రవాణాపై అసంతృప్తి
- పీక్ అవర్స్‌లో గంటల తరబడి నిరీక్షణ




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలో మంగళవారం ప్రజా రవాణా వ్యవస్థపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాయంత్రం పీక్ అవర్స్‌లో బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్‌స్టాప్‌ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రూట్లలో బస్సుల సంఖ్య తగ్గించడంతో రద్దీ మరింత పెరిగింది. మహిళలు, చిన్న పిల్లలతో ఉన్న ప్రయాణికులు నిల్చునే ప్రయాణం చేయాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. రోజూ ఇదే సమస్య. బస్సు ఎప్పుడు వస్తుందో తెలియదు. ఆలస్యంగా ఆఫీసుకు చేరాల్సి వస్తోంది.. అని ఓ ప్రయాణికుడు వాపోయాడు. రవాణా అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచాలని, సమయపాలన పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# పులుల గణనకు శ్రీకారం

- ముత్యంపల్లి సెక్షన్‌లో వన్యప్రాణి సర్వే
- ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026లో భాగంగా గణన
- బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని 21 బీట్లలో..

**వేద న్యూస్, కాసిపేట:**

ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026లో భాగంగా వన్యప్రాణి గణనను 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ తెలిపారు. ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని మూడు బీట్లలో బీటుకు ఇద్దరు చొప్పున వలంటీర్ల సహాయంతో వన్యప్రాణి గణనను ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా మొదటి మూడు రోజులు శాఖాహార జంతువులకు సంబంధించిన ట్రాన్సెక్ట్ లైన్ సర్వేను రెండు కిలోమీటర్ల పరిధిలో నిర్వహించి సమాచారం సేకరిస్తారు. అనంతరం తదుపరి మూడు రోజులు మాంసాహార జంతువులకు సంబంధించిన ట్రైల్ లైన్ సర్వేను ఐదు కిలోమీటర్ల మేర నడిచే విధంగా చేపడతారు. ఈ సమయంలో వన్యప్రాణుల పాదముద్రలు, విసర్జితాలు, పెంటికలు, చెట్లపై గీసిన గీతలు, భూమిపై పొర్లిన అచ్చులు వంటి గుర్తులను గుర్తించి ఎం స్ట్రిప్స్ ఇకలాజికల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని మొత్తం 21 బీట్లలో ఈ వన్యప్రాణి గణన సర్వే జరుగుతుందని బెల్లంపల్లి అటవీ క్షేత్ర అధికారి సీహెచ్. పూర్ణచందర్ తెలిపారు. ఈ సర్వే ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి పులుల సంఖ్యతో పాటు ఇతర వన్యప్రాణుల ఉనికిని అంచనా వేయడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఔత్సాహికులు ముందుగానే వాలంటీర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని, అందులో భాగంగా బెల్లంపల్లి డివిజన్ పరిధిలో హైదరాబాద్, కేరళ ప్రాంతాల నుంచి ఐదుగురు వాలంటీర్లు వచ్చినట్లు తెలిపారు. వారికి అటవీ శాఖ తరఫున అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. అలాగే వన్యప్రాణి గణనలో భాగంగా అటవీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో అనవసరమైన లేదా అక్రమ కార్యకలాపాలు సీసీ కెమెరాల్లో నమోదైతే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అటవీ అధికారులు హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## కేకే ఓసీ ఉపరితల గనిని సందర్శించిన కార్పొరేట్ అధికారి

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ ఉపరితల గనిని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (కార్పొరేట్) అధికారి సీహెచ్ వెంకటరమణ మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తేనే సంస్థ లక్ష్యాలను చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సిహెచ్ అశోక్, ఐఈడీ జీఎం కిరణ్ కుమార్, అకౌంట్స్ డీజీఎం ఆర్.వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, ఏరియా సర్వే ఆఫీసర్ డీజీఎం దేశాయ్, డివైఎస్ఈ అండ్ ఎం (పర్చేస్) బాబు, ఎన్విరాన్‌మెంట్ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

- అప్పారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, తోటల సందర్శన



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా రైతుల కోసం అప్పారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, తోటల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఫ్యాక్టరీని సందర్శించి ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ విధానం, నాణ్యత ప్రమాణాలు, చెల్లింపుల విధానం వంటి అంశాలపై అవగాహన పొందారు. అనంతరం రైతు ఏలేటి కిషోర్ ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా కోకోవ, వక్క, సరిహద్దుల్లో కొబ్బరి, దాల్చిన చెక్క సాగు చేస్తున్న విధానాన్ని చూపించారు. మల్టీ క్రాపింగ్ ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గాలను రైతులకు వివరించారు. ఈ సందర్శనతో రైతుల్లో ఆయిల్‌పామ్ సాగుపై నమ్మకం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ గోవర్ధన్, ప్రియునిక్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ ప్రేమ్ సాయి రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత కంటి శిబిరం

**వేద న్యూస్, చొప్పదండి:**

పట్టణంలోని స్థానిక వీణాదరి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్‌లోని డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ సావర్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్నా, పెద్ద తేడా లేకుండా ఎక్కువగా సెల్‌ఫోన్లు వినియోగించడం, టీవీలను అతి దగ్గరగా వీక్షించడం వల్ల కంటి చూపు తగ్గి రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో దగ్గర, దూరపు చూపు లోపాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో



పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వర్ధవెల్లి గ్రామ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రామన్నపేట వయా రాజన్నపేట, రెడ్డిపురం, దుబ్బపల్లె వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.3 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభివృద్ధిని మాటలతో కాకుండా ఆచరణలో చూపించే నాయకుడని అభిప్రాయపడ్డారు. ఆయన నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటికే శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించిన ఎంపీడీవో

**వేద న్యూస్, మందమర్రి:**




మందమర్రి మండల పరిధిలోని మామిడిగట్టు, సారంగపల్లి గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఉపాధి హామీ పనులు తదితర ప్రభుత్వ పథకాల అమలును ఎంపీడీవో రాజేశ్వరరావు మంగళవారం తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పారిశుధ్య పనుల నాణ్యత, పనుల వేగాన్ని సమీక్షించామని తెలిపారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి మరింత మెరుగుదల కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వివిధ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, లబ్ధిదారులకు నిధుల చెల్లింపులు సత్వరమే జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఒలుగొత్తుల సురేష్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి శాసనసభ్యుడు డా. మేడిపల్లి సత్యం వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని, రానున్న చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మనుపాటి మల్లేశం, ఒలుగొత్తుల నరసయ్య, ఇరిశెట్టి సునీల్, మావురపు అజయ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి, రాజన్నల తిరుపతి, బండారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'అరైవ్ అలైవ్' కార్యక్రమం కాదు ఉద్యమం

- మట్వాడ సీఐ కరుణాకర్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత నగరంగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని మట్వాడ సీఐ కరుణాకర్ స్పష్టంచేశారు. మంగళవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమాన్ని ఎంజీఎం సమీపంలో మట్వాడ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కరుణాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు




పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, ఎండలు, విపత్తులు ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, శివ కృష్ణ, తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రైమరి స్కూల్లో సీఎం కప్ క్రీడాజ్యోతి ఉత్సాహం

**వేద న్యూస్, కారేపల్లి:**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో సీఎం కప్ క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని మంగళ వారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని బొక్కలతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి భజ్యతండా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ రజిని పాల్గొని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రాధాన్యం పెంచేందుకు సీఎం కప్ దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 21, 2026

# ఆలింగనం.. మాటలకు అందని మానవీయ భాష

- స్పర్శలో దాగున్న భరోసా
- ఒంటరితనానికి ప్రతిఘటించే శక్తి

**వేద న్యూస్ డెస్క్:**

మనిషి చరిత్రను తిరగేస్తే, నాగరికతలు మారాయి, రాజ్యాలు కూలాయి, సాంకేతికత ఆకాశాన్ని తాకింది. కానీ మారని ఒకే ఒక మౌలిక అవసరం ఉంది. మానవీయ స్పర్శ. అదే ఆలింగనం. మాటలు లేకపోయినా, భాష తెలియకపోయినా, ఒక ఆలింగనం భావాలను అర్థం చేయగలదు. అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనిషి జీవనంలో ఈ అత్యంత సరళమైన కానీ అత్యంత లోతైన మానవీయ విలువను మరోసారి మన ముందుంచుతుంది.

ఆలింగనం ప్రేమకు మాత్రమే పరిమితం కాదు. అది భయం తొలగించే ధైర్యం. బాధలో ఉన్నవారికి ఇచ్చే ఓదార్పు. ఓటమిని ఎదుర్కొన్నవారికి మళ్లీ నిలబడే శక్తి. మాటలతో చెప్పలేని బాధను, కన్నీళ్లతో వ్యక్తం చేయలేని వేదనను ఆలింగనం నిశ్శబ్దంగా అర్థం చేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో "నేను ఉన్నాను" అనే మాట అవసరం ఉండదు. ఒక గాఢమైన ఆలింగనం చాలు.

పిల్లల జీవితంలో ఆలింగనం పాత్ర అమోఘం. తల్లి ఒడిలో దొరికే భద్రతే జీవితాంతం వారి మనసులో నిలిచే ధైర్యం. తల్లిదండ్రులు ప్రేమగా ఆలింగనం చేసుకున్న పిల్లలు భావోద్వేగంగా బలంగా ఎదుగుతారు. వారు తమ భావాలను దాచుకోరు, భయపడరు, ఇతరుల బాధను అర్థం చేసుకునే మనసుతో పెరుగుతారు. కానీ ప్రేమను మాటలకే పరిమితం చేసి, స్పర్శను దూరం పెట్టే కుటుంబాల్లో పిల్లలు ఒంటరితనాన్ని తొందరగా నేర్చుకుంటారు.

వృద్ధుల జీవితంలో ఆలింగనం మరింత అవసరం. బాధ్యతలు తగ్గిన తర్వాత, శారీరక శక్తి క్షీణించిన సమయంలో వారికి అవసరం సానుభూతి, గౌరవం, ప్రేమ. ఒక ఆలింగనం వారికి "మీరు ఇంకా అవసరమే" అనే భావనను కలిగిస్తుంది. వృద్ధాశ్రమాల్లో, ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుల్లో కనిపించే మౌన వేదనకు ఆలింగనం ఒక మానవీయ ఔషధంలా పనిచేస్తుంది.

నేటి సమాజంలో ఒంటరితనం ఒక పెద్ద సామాజిక సమస్యగా మారింది. ఒకే ఇంట్లో ఉన్నా మనుషులు దూరమవుతున్నారు. తెరల వెనక జీవితం సాగుతోంది. వేల మంది పరిచయాలు ఉన్నా, మనసు విప్పి మాట్లాడుకునే వ్యక్తి లేకపోవడం అనేక మందిని లోపలగా ఖాళీగా చేస్తోంది. ఈ మానసిక ఒత్తిడి అనేక సమస్యలకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలింగనం ఒక నిర్లక్ష్యానికి గురైన పరిష్కారంగా మారింది. ఇది ఖర్చు లేని, ప్రతిఫలం ఆశించని, కానీ అపారమైన మానసిక శక్తిని ఇచ్చే చర్య.

సమాజంలో ఆలింగనానికి సంబంధించి అపార్థాలు కూడా ఉన్నాయి. స్పర్శను బలహీనతగా చూడడం, భావోద్వేగాలను దాచుకోవడమే బలమని భావించడం మన సంస్కృతిలో కొంతకాలంగా పెరుగుతున్న ధోరణి. కానీ నిజమైన బలం భావాలను అర్థం చేసుకోవడంలో, అవసరమైనప్పుడు ప్రేమగా దగ్గర కావడంలోనే ఉంది. గౌరవం, అనుమతి, మర్యాదలతో కూడిన ఆలింగనం ఎలాంటి అపార్థాలకు తావివ్వదు. అది మనుషుల మధ్య నమ్మకాన్ని పెంచుతుంది.

ఆలింగనం ఒక సామాజిక ఐక్యతకు సంకేతం కూడా. కులం, మతం, భాష, ప్రాంతం అనే గీతలను దాటి మనుషులను దగ్గర చేస్తుంది. విభజనలతో నిండిన ఈ కాలంలో, మనిషిని మనిషిగా చూసే దృష్టిని పెంపొందిస్తుంది. ప్రకృతి విపత్తుల సమయంలో, సామాజిక సంక్షోభాల్లో, ఒకరి బాధను మరొకరు పంచుకునే తొలి అడుగు ఆలింగనమే అవుతుంది.

అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. మనం మనుషులం, యంత్రాలు కాదు. మన జీవితాల్లో స్పర్శకు మళ్లీ స్థానం ఇవ్వాలి. మన ఇళ్లలో పిల్లలను ప్రేమగా దగ్గర చేసుకోవాలి. మన వృద్ధులను గౌరవంతో ఆలింగనం చేసుకోవాలి. మన స్నేహితులను, సహచరులను అవసరమైనప్పుడు ధైర్యంగా దగ్గర కావాలి. ఎందుకంటే ఒక నిజమైన ఆలింగనం కేవలం ఒక క్షణం మాత్రమే కాదు. అది ఒక జీవితానికి ఇచ్చే భరోసా, ఒక సమాజాన్ని మళ్లీ మానవీయంగా మార్చే శక్తి. కుటుంబాల్లో ఆలింగనం తగ్గిపోతున్న కొద్దీ, భావోద్వేగాల వ్యక్తీకరణ కూడా తగ్గుతోంది. పిల్లల్ని ప్రేమతో ఆలింగనం చేసుకునే తల్లిదండ్రులు తగ్గితే, ఆ పిల్లలు పెద్దయ్యాక తమ భావాలను దాచుకోవడం నేర్చుకుంటారు. వృద్ధులను ప్రేమగా దగ్గర చేసుకునే అలవాటు తగ్గితే, వారు అనవసరంగా ఒంటరితనంలోకి నెట్టబడతారు. స్నేహితుల మధ్యనూ, సహోద్యోగుల మధ్యనూ స్పర్శకు స్థానం లేకపోవడం అనుమానాలకు, అపార్థాలకు దారితీస్తోంది. గౌరవం, అనుమతి, మర్యాదలతో కూడిన ఆలింగనం ఈ గోడలను కూల్చే శక్తి కలిగి ఉంది.

ఆలింగనం ఒక సామాజిక సందేశం కూడా. మనిషిని మనిషిగా చూసే దృష్టిని పెంపొందిస్తుంది. కులం, మతం, భాష, హోదా అనే గీతలను దాటి మనుషులను దగ్గర చేస్తుంది. విభజనలతో నిండిన కాలంలో, ఐక్యతను గుర్తు చేసే చిన్న కానీ ప్రభావవంతమైన చర్య ఇది. ఒకరి బాధను మన బాధగా భావించే భావనకు ఆలింగనం తొలి అడుగు.

అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనకు ఒక ప్రశ్న వేస్తుంది. మన చుట్టూ ఉన్నవారికి మనం ఎంత దగ్గరగా ఉన్నాం? మన ప్రేమను చెప్పడానికి మాటలకే పరిమితమవుతున్నామా? లేక మనసుతో, స్పర్శతో కూడా వ్యక్తం చేస్తున్నామా? ఈ రోజు ఒక నిర్ణయానికి రావాలి. మన ఇళ్లలో, మన స్నేహాల్లో, మన సమాజంలో ఆలింగనానికి మళ్లీ స్థానం కల్పించాలి. ఎందుకంటే ఒక నిజమైన ఆలింగనం కేవలం ఒక క్షణం మాత్రమే కాదు. అది ఒక జీవితానికి ఇచ్చే ధైర్యం, ఒక మనసుకు ఇచ్చే భరోసా.

# రంజాన్ ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- మసీదుల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం
- ట్రాఫిక్, త్రాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్ యాదాద్రి భువనగిరి :**



రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళ᳢వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రంజాన్ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మసీదుల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రార్థనల సమయంలో త్రాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ రోజున ఈద్గాలలో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు అవసరమైన వసతులు సమృద్ధిగా కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని మతాల పండుగలను సహోదర భావంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మైనారిటీ అధికారి మోహన్ సింగ్, ఆర్డీవో రత్నకళ్యాణి, ముస్లిం మత పెద్దలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అవినీతి, అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు బహిర్గతం చేస్తాం

- నోటీసులకు భయపడేది లేదు, ప్రశ్నిస్తూనే ఉంటాం
- సింగరేణి టెండర్లలో కుట్రలు, బెదిరింపులు
- సిట్ విచారణల పేరుతో ప్రజల దృష్టి మళ్లింపు – కేటీఆర్




**వేద న్యూస్ హైదరాబాద్ :**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు బాధ్యతాయుతమైన నాయకుడిగా హరీష్ రావు ఈరోజు హాజరయ్యారని పేర్కొన్నారు. నోటీసులు, సిట్ విచారణల పేరుతో ఎన్ని అటెన్షన్ డైవర్షన్‌లు చేసినా కాంగ్రెస్ హామీల వైఫల్యం, పరిపాలన లోపాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్రను ఇతరులపై అంటించేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. అధికారం అందలం ఎక్కినా బుద్ధి మారలేదని, కాంగ్రెస్ అంటేనే స్కాంల రాజకీయమని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఇప్పటివరకు ఒక్క అధికారిక ప్రకటన కూడా రాలేదని, కేవలం లీకులిచ్చి ఎంతకాలం ప్రజలను మభ్యపెడతారని ప్రశ్నించారు. గతంలో హరీష్ రావుపై ఉన్న అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. సింగరేణి టెండర్ల అంశంలో కీలక ఆరోపణలు చేస్తూ, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా టెండర్ల రిగ్గింగ్ జరిగిందని కేటీఆర్ అన్నారు. తొమ్మిది టెండర్లపై కుటుంబ నియంత్రణ ఉందని, మైనస్ టెండర్లు పడే చోట అంచనా విలువకన్నా అధికంగా టెండర్లు వేయించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ వంటి అడ్డగోలు నిబంధనలతో కంపెనీలను బెదిరించారని, అర్హులైన సంస్థలకు సర్టిఫికెట్లు ఇవ్వలేదని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిసారి అవినీతి బయటపడితే అటెన్షన్ డైవర్షన్‌కు పాల్పడుతుందని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలోనే మంత్రులను ఎదుర్కొన్న హరీష్ రావును నలుగురు పోలీసుల ముందు కూర్చోబెట్టినా భయపడేది లేదన్నారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, వెయ్యి నోటీసులు ఇచ్చినా, వంద సిట్‌లు వేసినా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా తమ పార్టీ నిలుస్తుందని, మరో రెండు సంవత్సరాల తర్వాత తిరిగి తమ ప్రభుత్వమే వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా కఠిన చర్యలు



- మురుగు నీరు నేరుగా చేరడంపై తీవ్ర ఆగ్రహం
- గుర్రపు డెక్క వ్యాప్తి కారణాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- శాఖల సమన్వయంతో సమస్యకు శాశ్వత పరిష్కారం

**వేద న్యూస్ హైదరాబాద్ :**

మాధాపూర్ గుట్టల్లోని దుర్గం చెరువులో దుర్గంధం, గుర్రపు డెక్క విస్తృతి పెరుగుతున్న నేపథ్యంలో హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని తీవ్రంగా పరిగణించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మీడియా కథనాలు, స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో చెరువులో సగభాగం వరకు గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను ఆయన పరిశీలించారు. ఎస్‌టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వారా మురుగు నీరు నేరుగా చెరువులోకి కలవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువలకు మళ్లించాలి కానీ చెరువులోకి ఎలా కలుపుతారని అధికారులను ప్రశ్నించారు. ఒకవైపు శుద్ధి చేసిన నీటిని పంపుతూ, మరోవైపు మురుగు నీటిని నేరుగా వదిలేయడం సరికాదని స్పష్టం చేశారు. చెరువు అభివృద్ధి అంటే పైపై అలంకరణ కాదని, మురుగు ప్రవాహాన్ని పూర్తిగా ఆపాల్సిందేనని చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి, ఇరిగేషన్ శాఖ, ఎస్‌టీపీ నిర్వహణ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడమే దుర్గంధానికి కారణమని పేర్కొన్నారు. ఎస్‌టీపీ వద్ద శుద్ధి అనంతరం నీటి నమూనాలను సేకరించి పీసీబీకి పంపాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిశీలన అనంతరం హైడ్రా కార్యాలయంలో సంబంధిత అన్ని శాఖల అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువల్లోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైన్ డైవర్షన్ పనులు తక్షణమే చేపట్టాలని, ట్రాఫిక్ డైవర్షన్‌కు పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. చెరువుకు ఆనుకుని పశ్చిమ వైపు కాలువ తవ్వకం ద్వారా ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల సమన్వయంతోనే దుర్గం చెరువుకు శాశ్వత పరిష్కారం సాధ్యమని హైడ్రా స్పష్టం చేసింది.

# సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు నాణ్యమైన గాగుల్స్ పంపిణీ

- రోడ్లపై దీర్ఘకాలం విధులు నిర్వర్తించే సిబ్బందికి రక్షణ
- కాలుష్యం, ధూళి, ఎండ నుంచి కంటి భద్రతకు చర్య
- ఉన్నతాధికారుల సమక్షంలో కమిషనరేట్‌లో కార్యక్రమం



**వేద న్యూస్ హైదరాబాద్ :**

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కంటి భద్రతకు చర్యలుగా నాణ్యమైన గాగుల్స్‌ను పంపిణీ చేసినట్లు సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డా. గజరావు భూపాల్ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ గాగుల్స్‌ను సిబ్బందికి అందజేశారు. రోడ్లపై దీర్ఘకాలం విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు కాలుష్యం, ధూళి, తీవ్రమైన ఎండ వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ గాగుల్స్ ఉపయోగకరంగా ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావుతో పాటు మాదాపూర్, మెడ్చల్, కూకట్‌పల్లి, బాలానగర్ పరిధుల ఏసీపీలతో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. సిబ్బంది సంక్షేమం పెరిగితే విధి నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు వ్యవస్థలో మానవ వనరుల భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

# పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌లపై బలవంతం వద్దు

**వేద న్యూస్ హైదరాబాద్ :**



వాహనాల పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌ల అంశంలో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల పేరుతో వాహనదారులను బలవంతంగా ఇబ్బంది పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించింది. చలాన్‌లు వసూలు చేసే క్రమంలో బలవంతపు చర్యలు చట్టబద్ధం కాదని కోర్టు స్పష్టం చేసింది. ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. వాహనాలను ఆపి, తాళాలు లాక్కోవడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వాహనాలను ఆపిన సమయంలో చలాన్‌లు చెల్లించాలని బలవంతం చేయకూడదని, వాహన తాళాలు తీసుకోవడం, వాహనాన్ని నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడరాదని పేర్కొంది. వాహనదారు స్వచ్ఛందంగా చలాన్ చెల్లించేందుకు ముందుకు వస్తే మాత్రమే పోలీసులు వసూలు చేయవచ్చని తెలిపింది. వాహనదారులు చలాన్‌లు చెల్లించడానికి ఇష్టపడని పక్షంలో, చట్ట ప్రకారం వారికి నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ నిబంధనల అమలులో ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని కోర్టు స్పష్టం చేసింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073